# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 143 | పేజీలు : 08 | ఆదివారం | 31-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**
తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని,

### సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయను.. నా దృష్టి అంతా అభివృద్ధి పైనే: సీఎం రేవంత్ రెడ్డి

2

## మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

సీఎం రేవంత్ రెడ్డి



- బీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికల నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న
- కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ది కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శ

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**
బీఆర్ఎస్ కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నామని అన్నారు. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందని, దేశంలోనే మొదటిసారిగా ఎక్కడాలేని విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తాము ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. మాజీ మంత్రి హరీశ్‌రావు తాము తీరుస్తున్న అప్పుల గురించి ఎందుకు చెప్పడం లేదన్నారు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

యోగి ఆదిత్యనాథ్



- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన

## బాల్క సుమన్ బలిపశువు



- బీఆర్ఎస్ డ్రామాలో బాల్క సుమన్ బలిపశువు: అద్దంకి దయాకర్
- రైలు పట్టాలు కోయాలని, దాడులు చేయాలని చెప్పడం కేసీఆర్ నైజమన్న దయాకర్
- అధికారం కోసం బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుందని మండిపాటు
- బాల్క సుమన్ తో ఈ వ్యాఖ్యలు ఎవరు చేయించారో తేల్చాలని డిమాండ్

## గవర్నర్‌ను కలిసిన డీకే శివకుమార్..

ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై చర్చ



**హైదరాబాద్ పల్స్,డెస్క్**
కర్ణాటక ముఖ్యమంత్రి పదవి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అనూహ్యంగా పావులు కదిపారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరగడానికి ముందే ఆయన శనివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్‌తో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన, గవర్నర్‌తో అనధికారికంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రిగా తనను ఎన్నుకునే పక్షంలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు,

## పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు

- నన్ను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు: బాల్క సుమన్
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తతల మధ్య బాల్క సుమన్ అరెస్ట్
- పోలీసులను అడ్డుకుని, నినాదాలు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపేనన్న బాల్క సుమన్



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**
తనను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయించారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. అరెస్ట్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష

## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు

మంత్రి కందుల దుర్గేష్!



- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన

## ఫిర్యాదుదారుల కోసం పోలీసులు అందుబాటులో ఉండాలి: డీజీపీ ఆనంద్



## బాల్క సుమన్‌పై పీడీ యాక్ట్ పెట్టాలి

ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్



- సింగరేణిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు
- బాల్క సుమన్ ను అరెస్ట్ చేసిన పోలీసులు
- సుమన్‌కు రైలు పట్టాలు కోసే శాఖను కేసీఆర్ ఇచ్చారని వెంకట్ ఎద్దేవా

## ఈసారి రుతుపవనాలకు ఎల్ నినో దెబ్బ



- ఈ ఏడాది దేశంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం
- ఎల్ నినో ప్రభావమే కారణమని వెల్లడించిన వాతావరణ శాఖ
- కేరళలో జూన్‌లోనూ వర్షాలు తక్కువగానే ఉంటాయని అంచనా
- ఢిల్లీ, రాజస్థాన్‌లో ఆకస్మిక వర్షాలతో చల్లబడిన వాతావరణం
- ఢిల్లీలో జూన్ 4 వరకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని వెల్లడి

**హైదరాబాద్ పల్స్,డెస్క్**
దేశంలో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక అంచనాలను విడుదల చేసింది. ఈ ఏడాది కేరళ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో 'సాధారణం కంటే తక్కువ' వర్షపాతం నమోదవుతుందని శనివారం

## బాబా రాందేవ్‌కు షాక్..

పతంజలి ఉత్పత్తులు సీజ్




- రాష్ట్రవ్యాప్తంగా మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కొరడా
- సీజ్ చేసిన వాటిలో పతంజలి ఉత్పత్తులు
- తప్పుదోవ పట్టించే ప్రకటనలపై చర్యలు
- మొత్తం రూ.73.24 లక్షల విలువైన మందులు సీజ్
- హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులు స్వాధీనం
- మహారాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ'

ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం



**హైదరాబాద్ పల్స్,డెస్క్**
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు

## తెలంగాణ ఎడ్‌సెట్ 2026 ఫలితాలు విడుదల



- 96.95 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత
- బానోత్ అజిత్ సాయికి మొదటి ర్యాంకు
- అధికారిక వెబ్‌సైట్‌లో ర్యాంక్ కార్డులు

# దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

మొదటి పేజీ రువాయి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

# బాల్క సుమన్ బలిపశువు

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇటీవల బీఆర్ఎస్ నేతలు వాడుతున్న భాష, అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై తీవ్రంగా మండిపడ్డారు.రైలు పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం ముమ్మాటికీ కేసీఆర్ నైజమని దయాకర్ విమర్శించారు. "కేసీఆర్ తనకు తెలిసిన కుటిల రాజకీయాన్ని కేటీఆర్‌కు నేర్పితే.. కేటీఆర్ అదే విషయాన్ని బాల్క సుమన్‌కు నూరిపోశారు. కాళేశ్వరంలో తప్పులు చేసి, ఫార్ములా రేస్ నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళుతూ కూడా 'జై తెలంగాణ' అనడం బీఆర్ఎస్ నేతలకే చెల్లింది" అని ఎద్దేవా చేశారు.ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, రైతులను రెచ్చగొట్టడమే అజెండాగా పెట్టుకున్న బీఆర్ఎస్, అధికారం కోసం ఎంతకైనా తెగిస్తుందని దయాకర్ ధ్వజమెత్తారు. బాల్క సుమన్‌తో ఈ తరహా వ్యాఖ్యలు చేయించిన అసలు సూత్రధారులెవరో పోలీస్ అధికారులు సమగ్ర విచారణ జరిపి తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# బాల్క సుమన్‌పై పీడీ యాక్ట్ పెట్టాలి

మొదటి పేజీ రువాయి

సింగరేణిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపింది. ఈ పరిణామంపై ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన చేసిన వ్యాఖ్యలే కారణమని, దీని వెనుక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర దాగి ఉందని వెంకట్ ఆరోపించారు. "మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి, కానీ సామాన్య పేద ప్రజలు ప్రయాణించే రైళ్లపై మీకెందుకు అంత అక్కసు? మీకు ఓట్లేయలేదనే కక్షతోనే పేదలపై ఇలాంటి కుట్రలు చేస్తున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపినట్లు గుర్తుచేశారు.కేసీఆర్ ఒక్కొక్కరికి ఒక్కో వివాదాస్పద బాధ్యత అప్పగించారని.. సుమన్‌కు రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చారని వెంకట్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు బీఆర్ఎస్ యత్నిస్తోందని, సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు.

# బాబా రాందేవ్‌కు షాక్..

మొదటి పేజీ రువాయి

ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి బ్రాండ్ ఉత్పత్తులకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) షాక్ ఇచ్చింది. నివారణ అంటూ తప్పుదోవ పట్టించే, అభ్యంతరకరమైన ప్రకటనలు ఇస్తున్నారన్న ఆరోపణలతో ఎఫ్‌డీఏ రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి భారీగా మందులను స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన ఆయుర్వేద, అల్లోపతి మందుల విలువ సుమారు రూ.73.24 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ మందుల్లో పతంజలి బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఉత్పత్తులు కూడా ఉన్నాయి.డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ముంబై, కొంకణ్, పుణె, నాసిక్, అమరావతి, నాగ్‌పుర్, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్లలో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో పతంజలి బ్రాండ్ కింద మార్కెటింగ్ చేస్తున్న, హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నాగ్‌పూర్ డివిజన్‌లో రూ.7,26,755 విలువైన మందులను, నాసిక్ డివిజన్‌లో రూ.7,10,945 విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది

# ఈసారి రుతుపవనాలకు ఎల్ నినో దెబ్బ

మొదటి పేజీ రువాయి

వెల్లడించింది. దీనికి ఎల్ నినో ప్రభావమే ప్రధాన కారణమని, ఇది దాని విచిత్రమైన లక్షణమని ఐఎండీ డైరెక్టర్ నీతా కే గోపాల్ తెలిపారు.ఆమె మాట్లాడుతూ, "వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈసారి రుతుపవనాల తీరు ఆశాజనకంగా లేదు. కేరళతో పాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా ఉంటుంది" అని వివరించారు. ముఖ్యంగా కేరళలో జూన్ నెలలోనూ వర్షపాతం తక్కువగానే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. "రుతుపవనాల ఆగమనం తర్వాత, జూన్ 10 ప్రాంతంలో కొన్ని మంచి వర్షాలు పడవచ్చు. కానీ ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయి. దీంతో నెల మొత్తం మీద వర్షపాతం తక్కువగానే నమోదవుతుంది" అని నీతా గోపాల్ తెలిపారు.

# నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## తెలంగాణ ఎడ్‌సెట్ 2026

# ఫలితాలు విడుదల

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి ఈ ఫలితాలను వెల్లడించారు. ఈ పరీక్షలో మొత్తం 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వారు తెలిపారు.ఈ ఏడాది ఎడ్‌సెట్‌కు మొత్తం 35,600 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,342 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 28,446 మంది అర్హత సాధించినట్లు ప్రకటించారు. బానోత్ అజిత్ సాయి ప్రథమ ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచారు.ఎడ్‌సెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో రెండేళ్ల బీఈడీ కోర్సులో చేరేందుకు అర్హులు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ https://edcet.tgche.ac.in/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు

మొదటి పేజీ రువాయి

సాధిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కి పైగా కేసులు పెట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహాలో వేధిస్తోందని అన్నారు.రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగుతోందని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని ఆరోపించారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెబుతూనే, నేతలను విచారణ పేరుతో వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. తాను ఎక్కడకూ పారిపోలేదని, పార్టీ కార్యక్రమంలోనే ఉన్నానని తెలిపారు.

**అరెస్టు సమయంలో ఉద్రిక్తత**

బాల్క సుమన్ అరెస్టు చేసే సమయంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. అరెస్ట్‌ను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పార్టీ కార్యాలయం వద్ద గందరగోళం ఏర్పడింది. బాల్క సుమన్ తెలంగాణ భవన్‌లో ఉన్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే, పోలీసులు లోపలికి వస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం బీఆర్ఎస్ న్యాయవాదులతో చర్చలు జరిపిన పోలీసులు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.

# జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ'

మొదటి పేజీ రువాయి

ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

## సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయను..

# నా దృష్టి అంతా అభివృద్ధి పైనే: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, మే 30: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై, ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు వివాదాలను, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనకు అలాంటి రాజకీయాలు చేయడం ఇష్టం లేదని, తన దృష్టి మొత్తం కేవలం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం పైనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును, ఆ పార్టీ నాయకుల ద్వంద్వ నీతిని ఎండగట్టారు.గతంలో ఖమ్మంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని అప్పటి బీఆర్ఎస్ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఏర్పాటు చేసిన విషయాన్ని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్‌లో కమ్మ సంఘానికి కేసీఆర్ ప్రభుత్వం పది ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించలేదా అని ఆయన ప్రశ్నించారు. తెలుగు ప్రజల హృదయాల్లో చెరపలేని ముద్ర వేసిన ఎన్టీఆర్ వంటి మహానుభావులను కేవలం ఒక కులానికో, ప్రాంతానికో ముడిపెట్టి మాట్లాడటం బుద్ధిలేనితనమే అవుతుందని సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతు ధర్నాలపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారంటూ రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ధర్నాలకు నిజమైన రైతులు రావడం లేదని, కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలే వస్తున్నారని బాల్క సుమన్ స్వయంగా చెప్పారని సీఎం పేర్కొన్నారు. దీన్ని బట్టి విపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే కృత్రిమ ఉద్యమాలు చేస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు.

# గవర్నర్‌ను కలిసిన డీకే శివకుమార్..

మొదటి పేజీ రువాయి

తేదీలపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని శివకుమార్ వర్గాలు చెబుతున్నాయి. జ్యోతిష్కులు సూచించిన ప్రకారం జూన్ 1, 3, 5 తేదీల్లో ఒక మంచి ముహూర్తాన్ని ఖరారు చేసే అంశంపై గవర్నర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూన్ 3వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు డీకే శివకుమార్ మొగ్గు చూపుతున్నారని, ఈ విషయాన్ని గవర్నర్ కార్యాలయానికి కూడా చేరవేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రమాణ స్వీకార వేదికగా విధాన సౌధ మెట్ల భాగాన్ని గానీ, రాజ్‌భవన్‌ను గానీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది.మరోవైపు కాంగ్రెస్ పార్టీలో ఉప ముఖ్యమంత్రి పదవుల కోసం తీవ్రమైన లాబీయింగ్ మొదలైంది. లింగాయత్ వర్గం నుంచి సీనియర్ నేతలు ఎం.బీ. పాటిల్, ఈశ్వర్ ఖండ్రే ఈ పదవిని ఆశిస్తున్నారు. అలాగే, మాజీ స్పీకర్ యూటీ ఖాదర్, సీనియర్ ఎమ్మెల్యే తన్వీర్ సైత్, సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడైన జమీర్ అహ్మద్ ఖాన్ కూడా డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారు. ఎస్సీ వర్గం నుంచి సీనియర్ నేతలు జి.పరమేశ్వర, హెచ్.సి. మహదేవప్ప కూడా ఆశలు పెట్టుకున్నారు.అయితే, వివిధ వర్గాల నుంచి తీవ్రమైన పోటీ ఉండటంతో పార్టీలో అనవసర విభేదాలు రాకుండా ఉండేందుకు అసలు డిప్యూటీ సీఎం పదవులే లేకుండా చేయాలనే ఆలోచనను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొత్త ముఖ్యమంత్రితో పాటు దాదాపు 12 నుంచి 14 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎల్పీ సమావేశం సాయంత్రం 4 గంటలకు జరగనుండగా, అంతకుముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

# మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

మొదటి పేజీ రువాయి

ముందే చెప్పామని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదని తెలిపారు. కేసీఆర్ మీద ఒట్టేసి తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలని కోరారు. గతంలోనూ హరీశ్‌రావు వైఎస్ఆర్ దగ్గరికి వెళ్లారని రేవంత్ ఆరోపించారు. హరీశ్‌రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసునని కానీ తాను చెప్పనని స్పష్టం చేశారు. పార్టీ మీటింగ్ వదిలేసి హరీశ్‌రావు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయనటంలో అనుమానమే లేదని ముఖ్యమంత్రి చెప్పారు.ప్రాథమిక ఆధారాలతో 2 కేసులు సీబీఐకి ఇచ్చామని, సీబీఐ దర్యాప్తు ఇంకా ఎందుకు జరగట్లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, తనది విజయవంతమైన కాంబినేషన్ అన్న రేవంత్ రెడ్డి.. తమ ఇద్దరి నేతృత్వంలో అన్ని ఎన్నికలు గెలిచామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్‌గౌడ్‌కు మంచి పదవి రావొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.జవాబుపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. తెలంగాణలో 32 శాతం ధాన్యం మాత్రమే కేంద్రం కొంటోందని రేవంత్?రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవివాదాలను పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్తున్నారని, ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఎందుకు అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదో చెప్పాలన్నారు.పోలవరం కోసం 7 మండలాలు ఇచ్చిన మోదీ.. తెలంగాణ కోసం తిరిగి ఇప్పించలేరా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేని తనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేదా.. కమ్మ సంఘానికి కేసీఆర్ 10 ఎకరాలు ఇవ్వలేదా.. అంటూ ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే తానేనని ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రలో తెలంగాణ వాళ్ల విగ్రహాల గురించి ఏపీలో పార్టీ పెట్టిన కేసీఆర్ ను అడగాలని సూచించారు. కేటీఆర్.. తారకరామారావు పేరు ఎందుకు మార్చుకోవడం లేదని నిలదీశారు. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవట్లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు

మొదటి పేజీ రువాయి

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

# ఫిర్యాదుదారుల కోసం పోలీసులు అందుబాటులో ఉండాలి: డీజీపీ ఆనంద్

మొదటి పేజీ రువాయి

ఫిర్యాదుదారుల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీజీపీ ఆనంద్ సూచించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ల నుంచి ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డీజీపీ, పాత పద్ధతులను విడిచిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని డీజీపీ తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని సూచించారు. త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, ఫుడ్ అడల్ట్రేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు.జూనియర్లు సీనియర్లకు గౌరవం ఇవ్వాలని, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టెక్నికల్ సేవల కోసం ప్రత్యేకంగా డీజీపీ టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్లు క్రైమ్ రివ్యూ తప్పకుండా నిర్వహించాలని, యూనిట్ హెడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించాలి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి వంటి ప్రజా అవసరాల రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి జిల్లాకు పరిశ్రమల నుంచి వచ్చిన సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం, ప్రస్తుత సంవత్సరానికి ప్రతిపాదించిన పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, వంటశాలలు, భోజనశాలలు, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు నిధులు వినియోగించాలని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతిపాదిత పనుల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి,ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి జోన్‌లో అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించిన జోనల్ కమిషనర్:నారాయన్ అమిత్ ఐఏఎస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30,శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ శనివారం నాడు జోన్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ సర్కిళ్లు, వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఈ సమావేశంలో క్షుణ్ణంగా అంచనా వేశారు.

**సమీక్షలో చర్చించిన ముఖ్యాంశాలు:**

– **రోడ్ల అభివృద్ధి పనులు:** కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, బీటీ రోడ్ల పునరుద్ధరణ పనుల ప్రస్తుత స్థితి

– **వర్షపు నీటి కాలువల ప్రాజెక్టులు:** స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు, వరద నివారణ చర్యల అమలు తీరు

– **పార్కుల అభివృద్ధి:** పార్కుల సుందరీకరణ, కొత్త పార్కుల ఏర్పాటు, ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌ల పనుల పురోగతి

– **పౌర మౌలిక సదుపాయాలు:** కమ్యూనిటీ హాళ్లు, పబ్లిక్ టాయిలెట్లు, స్ట్రీట్ లైట్లు తదితర పనుల వివరాలు


– **ఇతర ప్రజా ఉపయోగ పనులు:** జోన్ పరిధిలో చేపట్టిన వివిధ ప్రజోపయోగ ప్రాజెక్టుల స్థితిగతులు

ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ ఐఏఎస్ మాట్లాడుతూ, అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు




# రాష్ట్ర అగ్రశ్రేణి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో బ్రిలియంట్ విద్యార్థులకు ప్రవేశాలు

**ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించి డోర్నకల్ ఖ్యాతిని చాటిన విద్యార్థులు**



**హైదరాబాద్ పల్స్, మే 30, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం విద్యా రంగంలో నాణ్యతను పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు అత్యున్నత విద్యా అవకాశాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు,ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు నేడు రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా గుర్తింపు పొందాయి. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఈ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం పోటీ పడుతుండగా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మాత్రమే ప్రవేశాలు లభిస్తున్నాయి. అటువంటి ప్రతిష్ఠాత్మక కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో డోర్నకల్ బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మరోసారి తమ సత్తా చాటారు. రాష్ట్రంలోని అగ్రశ్రేణి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా పేరుగాంచిన గౌలిదొడ్డి (హైదరాబాద్), కరీంనగర్, ఎల్కతుర్తి (హనుమకొండ), హసన్‌పర్తి (వరంగల్) కళాశాలల్లో బ్రిలియంట్ విద్యార్థులు ప్రవేశాలు పొందడం పాఠశాల చరిత్రలో మరో గర్వకారణంగా నిలిచింది. ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన జై మేఘన గౌలిదొడ్డి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, ఎం సంకీర్తన కరీంనగర్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, ఏ అమూల్య ఎల్కతుర్తి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, డి మేఘన హసన్‌పర్తి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశాలు సాధించారు. రాష్ట్రంలోని అత్యుత్తమ నాలుగు కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో బ్రిలియంట్ విద్యార్థులు అడ్మిషన్లు పొందడం విద్యార్థుల ప్రతిభకు, పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఒక్కతుల అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల వెనుక నిరంతర కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఆరో తరగతి నుంచే విద్యార్థులకు ప్రత్యేక ఫౌండేషన్ శిక్షణ అందిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థుల మేధో సామర్థ్యాలను పెంపొందించే దిశగా ప్రత్యేక అధ్యయన ప్రణాళికలు, తరచూ నిర్వహించే పరీక్షలు, వ్యక్తిగత మార్గదర్శకత్వం, సందేహ నివృత్తి తరగతులు, పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు విజయానికి బాటలు వేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన అవకాశాలు, నాణ్యమైన విద్య లభిస్తే రాష్ట్రస్థాయిలో అద్భుతాలు సృష్టించగలరని బ్రిలియంట్ విద్యార్థులు మరోసారి నిరూపించారని అన్నారు. కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలియజేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థులు సాధించిన ఈ విజయం డోర్నకల్ ప్రాంత విద్యా రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.



# ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, మే 30 : దేశవ్యాప్తంగా సెక్యులర్ ఓటర్లను తొలగిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరగకుండా బూత్‌స్థాయి నుంచి కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. శనివారం గాంధీ భవన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ), సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లతో (ఎస్ఎస్ఏ) సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక నిఘా ఉంచుతుందని, ఇందులో భాగంగా ప్రతివారం మంత్రులు తమ తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు




# అక్రమంగా చెరువులో మట్టి తరలింపు

**ఇదేందని అడిగితే స్థానిక ఎమ్మెల్యే పేరు ప్రస్తావించడం గమనార్హం.!**



**హైదరాబాద్ పల్స్, మే 30, షాద్నగర్ :** కొత్తూరు మండలంలోని తిమ్మాపూర్ చేగూర్ రోడ్డు నుండి మక్తగూడ శివారు వరకు కొత్తగా సాంక్షన్ అయిన రోడ్డు పనులకు అక్రమంగా గూడూరు గ్రామ పంచాయతీ మరియు మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల రామయ్య చెరువులో మట్టిని అనుమతి లేకుండా ఇష్టరాజ్యంగా 20 నుంచి 30 ఫీట్ల లోతులో తవ్వి అక్రమంగా తరలించడం జరుగుతుంది. మరియు ఇతరులకు కూడా అవసరమైన మేర ఇష్ట రాజ్యాంగా తరలిస్తున్నారని, మరియు ఇదేందని అడిగితే స్థానిక ఎమ్మెల్యే పెరు ప్రస్తావించడం స్థానికంగా కలకలం రేపుతుంది. మరియు కొత్తూరు మండల తాసిల్దార్ ని అడిగితే మాకు తెలియదు అని చెప్పడం కొసమరుపు. గ్రామాలలో ఉన్న చెరువులని ఇష్ట రాజ్యాంగ తవ్వి యదేచ్ఛంగా అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్లని తగిన బుద్ధి చెప్పాలి స్థానికులు వాపోతున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచులు సపోర్ట్ చేస్తున్నారనారని కూడా సమాచారం. ఇప్పటికైనా అక్రమ మట్టిని తరలించడం ఆపకపోతే పై అధికారులకు సమాచారమ్ అందిస్తామని గ్రామ ప్రజలు తెలిపారు.

# నేడు నల్లపోచమ్మ జాతరకు అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ స్టార్ నైనా జైస్వాల్ రాక




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఏడు గురువారాలు – ఏడు ఆదివారాల జాతర మహోత్సవాల్లో భాగంగా నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఆరవ ఆదివారం జాతరకు ప్రముఖ భారతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ హాజరవుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ఛాంపియన్‌షిప్‌లలో విజేతగా నిలిచిన నైనా జైస్వాల్ ప్రపంచ టేబుల్ టెన్నిస్ రంగంలో భారతదేశానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చి దేశ ఖ్యాతిని పెంచారని పేర్కొన్నారు. ఆమె రాకతో జాతర మహోత్సవాలకు మరింత ప్రత్యేకత చేకూరనుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు

# బిక్షాటన చేస్తు వివోఏ ల నిరసన....

**- 13 రోజుకు చేరిన వివోఏ ల సమ్మె**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆత్మకూరు(ఎం) మండలంలో వివోఏలు తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరుతూ మహిళ సమాఖ్య కార్యాలయం ఎదుట వివోఏ లు చేస్తున్న సమ్మె రిలే నిరాహార దీక్షలు పదమూడు రోజులకు చేరాయి. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, మండల సమాఖ్య కార్యాలయంతో పాటు మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సంధర్భంగా వివోఏ జేఏసి జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష మాట్లాడుతూ.... వివోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు ఇరవై వేలు ఇవ్వాలని, ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వం అధికారులు తక్షణమే వివోఏ ల న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏ జేఏసి నాయకులు తవిట స్వప్న, తుమ్మల సరితా, కడారి నిర్మల, బూడిద సుచరిత,ఉప్పల విజయ,మర్యాల నాగభూషణం, కొరకొప్పుల సుధాకర్, వేములకొండ శ్రీనివాస్, పోలేపాక భాగ్యమ్మ, ఎం.విజయలక్ష్మి, కానుకుంట్ల శ్రీనివాస్, మేడి రామ్ లక్ష్మణ్, కాన్ రాజు నాగరాణి, కాసాని ధనమ్మ, పి.వనితా, కే.మౌనిక, ఎం.ప్రమీల, పాశం శ్యామల, భూషి ఉపేంద్ర పాల్గొన్నారు

# చర్ల తిరుమలాపూర్ గ్రామంలో సన్మాన కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, మే 30, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
మా గ్రామ సర్పంచ్ గాజుల కృష్ణ,మాజీ సర్పంచ్ ఎమ్. రాములుకు హృదయపూర్వక అభినందనలు చర్ల తిరుమలాపూర్ గ్రామస్థుల అయినా కావలి చంద్రయ్య మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మా గ్రామ సర్పంచ్ గాజుల కృష్ణ గ్రామ సెక్రటరీ నారాయణమ్మ, మాజీ సర్పంచ్ ఎమ్.రాములు శాలువతో ఘనంగా సన్మానించారు అలాగే సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామానికి ఎంతో గర్వకారణం మీ నాయకత్వం, సేవాభావం, ప్రజల పట్ల మీ అంకితభావం ఈ స్థాయికి తీసుకువచ్చాయి. మీరు ఇంకా ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. మీ ఈ విజయంతో గ్రామ ప్రజలందరికీ ఆనందం, ఉత్సాహం కలిగింది. ఇలాగే ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగాలని అంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ముచునూరు స్వామి గౌడ్ , మల్లెల యాదగిరి, మ్.లక్ష్మయ్య, మిరియాల సాయి కిరణ్, కుమ్మరి రామకృష్ణ , ఎమ్ నాగేంద్ర గౌడ్, కావలి శ్రీను,కావలి సుధాకర్, వడ్డెమన్ శేఖర్, కావలి కాశీనాథ్, అలాటి శేఖర్, వంగ లక్ష్మయ్య , ఆర్కలీ వెంకటేష్.

# మహిళల సంరక్షణకు భద్రత యాప్లపై అవగాహనా సదస్సు నిర్వహించండి



**కుత్బుల్లాపూర్, మే 30, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కుత్బుల్లాపూర్ కోంపల్లి వీజీ హోమ్స్ నివాసితులు మహిళల భద్రత, సురక్షిత సమాజ నిర్మాణం కోసం మరో ముందడుగు వేశారు. ఈ సందర్భంగా కొంపల్లి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ను కలిసి మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, అత్యవసర సహాయ సేవలు, సేఫ్టీ యాప్‌ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సుమారు 300 కుటుంబాలకు ప్రయోజనం చేకూరే ఈ కార్యక్రమాన్ని జూన్ 7, 2026 ఉదయం 10 గంటలకు నిర్వహించేందుకు ప్రతిపాదించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతపై అవగాహన పెంపొందించడంలో పోలీసు–ప్రజల భాగస్వామ్యానికి ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలవనుంది అని అన్నారు కాలనీ వాసులు

# మున్సిపల్ కార్మికులకు రెగ్యులర్ చేయాలి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, నారాయణ ఖేడ్ :**
మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని వారికి రెగ్యులర్ చేయాలని సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నారాయణఖే డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారికి రెగ్యులర్ చేయాలని పెరిగిన ధరలకు అనుకూలంగా జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు ప్రభుత్వాలు మారిన కార్మికుల బతుకులు మారడం లేదని కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని కార్మికుల హక్కుల కోసం కార్మికులందరూ ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలు శకుంతల చంద్రకళ బేబీ సాయమ్మ నరసమ్మ సిద్ధమ్మ లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సంక్షేమమే లక్ష్యంగా సరండి సర్పంచ్ మొహర్లే బాపూజీ సేవలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని సరండి గ్రామపంచాయతీలో సర్పంచ్ మొహర్లే బాపూజీ ఉపాధి హామీ పథకం అమలులో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ కూలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆయన స్వయంగా ముందుకు వచ్చి పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు శీతల పానీయాలను అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కఠిన పరిస్థితుల్లో పనిచేస్తున్న కూలీలకు తగిన ఆహారం, తాగునీరు అందించడం ద్వారా వారి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. ఎండల కారణంగా వడదెబ్బలు, అలసట వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. కూలీల ఆరోగ్యం బాగుంటేనే పనులు సమర్థవంతంగా జరుగుతాయని, వారి సంక్షేమం గ్రామాభివృద్ధికి కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అదే సమయంలో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని గ్రామస్థులు తెలిపారు. కూలీల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. సాధారణంగా ఉపాధి హామీ పనులు నిర్వహించడం వరకు మాత్రమే పరిమితమయ్యే సందర్భాల్లో, కూలీల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి ఆహారం, శీతల పానీయాలు పంపిణీ చేయడం సర్పంచ్ యొక్క మానవతా దృక్పథాన్ని చాటుతోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు కూలీలలో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా పనుల పట్ల మరింత నిబద్ధతను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమాన్ని సమానంగా పరిగణిస్తూ పనిచేస్తున్న సరండి సర్పంచ్ మొహర్లే బాపూజీ సేవలు ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తాయని గ్రామ పెద్దలు, కూలీలు, స్థానికులు ప్రశంసించారు. ఉపాధి హామీ కూలీల పట్ల చూపుతున్న శ్రద్ధ, మానవీయతకు గుర్తింపుగా ఆయనకు ప్రత్యేక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# పుణే కల్తీ మద్యం మరణాల కేసు.. 13 మంది ఎక్సైజ్ అధికారులపై సస్పెన్షన్ వేటు!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ డెస్క్:**
పుణేలో కల్తీ మద్యం తాగి శుక్రవారం 11 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో స్పందించింది. అక్రమ మద్యం విక్రయాలు, సరఫరాను అరికట్టడంలో ఘోరంగా విఫలమైనందుకు, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు చెందిన 13 మంది అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని పుణే రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అతుల్ కనాడే అధికారికంగా ధృవీకరించారు.సస్పెన్షన్‌కు గురైన వారిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు శాఖకు చెందిన మరో నలుగురు సిబ్బంది ఉన్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ అక్రమ మద్యం మరణాల కేసును ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలను మరింత ముమ్మరం చేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ పేర్కొంది. ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు.

# దుర్గమ్మ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీడీవో బృందం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం చెల్లూరు గ్రామంలో జరుగుతున్న దుర్గమత జాతర ఉత్సవాల్లో శనివారం ఎంపీడీవో నాగవేణి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, సూపర్డెంట్ అల్లం ఇన్నారెడ్డి, మిగతా ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ప్రత్యేక పూజలు చేయగా, సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య, ఉప సర్పంచ్ బొంత సుధాకర్, జాతర నిర్వాహకులు గ్రామ పెద్దలు పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో నాగవేణి, సూపరిండెంట్ ఇన్నారెడ్డి ఇతర ఉద్యోగులకు శాలువాతో సత్కరించారు. రాత్రి అన్ని కులాల వారు అమ్మవారికి సామూహికంగా బోనాలు సమర్పించారు. ప్రధాన వీధుల గుండా బోనాలతో శివసత్తులు శిగాలు ఊగుతూ నృత్యాలు చేస్తూ ఆలయం వద్దకు చేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధువులు ఆప్తులు నాయకులు పాల్గొన్నారు

# సంగటన్ సృజన్ అభియాన్‌తో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం: ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, నారాయణఖేడ్ :**
హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "సంగటన్ సృజన్ అభియాన్" కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందే దిశగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం సూచించిన మార్గదర్శకాల మేరకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బేటి బచావో బేటి పడావో అవగాహన కార్యక్రమం....




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో బేటి బచావో బేటి పడావో ప్రచార కార్యక్రమం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా శిశు సంక్షేమ మహిళా సాధికారిక కేంద్రం సంయుక్త నిర్వహణలో తెలంగాణ సాంస్కృత సారథి కళాకారుల చేత బాల బాలికల రక్షణ విద్య వ్యాప్తి ప్రత్యేక అవగాహన కార్యక్రమం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లెర్ల సర్పంచ్ తండా మంజుల నరసింహా గౌడ్, వార్డ్ మెంబర్ సభ్యులు, అంగన్వాడి టీచర్ మేడి మాధవి కళాకారులు ఎర్ర చరణ్ రాజ్, శంకర్, కృష్ణ, కిట్టు, పరంజ్యోతి మరియు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
భువనగిరి డిఆర్‌డిఎ – ఎస్.ఈ.ఆర్.పి ఆధ్వర్యంలో కమ్యూనిటీ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం (జెండర్ రిసోర్స్ సెంటర్) ను మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి మాట్లాడుతూ... కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహ హింస, ఆరోగ్యం, పోషకాహారం పై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మండల స్థాయి సోషల్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందని, బాధితులు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చని సూచించారు. ఈ సందర్బంగా మున్సిపల్ చైర్మన్ తంగా ళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాసిన్, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో దినకర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రసాల శిరీష, కార్యదర్శి ఏదునూరి వాణి, కోశాధికారి కవిత, ఏపీఎం పాశికంటి మల్లేశం, సీసీలు అఫ్సర్, అలివేలు, మల్లేష్, కవిత, అకౌంటెంట్ పుష్ప, జి.ఆర్.సి సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు చొక్కా కుమారి, తిరుమల, సత్యలక్ష్మి, అంజమ్మ, మౌనిక, కవిత పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కే. లలితాదేవి బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కే. లలితాదేవి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో చార్మినార్ జోన్ డీఎంహెచ్ఓగా సేవలందించిన ఆమె, బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో ఆరోగ్య సేవల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కార్యక్రమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన వైద్య సేవల అందుబాటు, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరూ కష్టపడి పనిచేస్తూ సమయపాలన పాటించాలని, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ పనితీరును మరింత మెరుగుపరుస్తూ సంగారెడ్డి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో ఐఎస్ఐ-అండర్‌వరల్డ్ ఉగ్రవాద ముఠా గుట్టురట్టు.. 9 మంది అరెస్ట్!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ డెస్క్:**
పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ, ముంబై అండర్‌వరల్డ్ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న ఒక భారీ ఉగ్రవాద ముఠా గుట్టును ఢిల్లీ పోలీసులు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా తొమ్మిది మంది (9) అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు శనివారం (మే 30) ఒక అధికారి వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కీలక ప్రాంతాలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపేందుకు ఈ ముఠా భారీ వ్యూహం పన్నినట్లు పోలీసులు తెలిపారు.అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా ఈ ఉగ్రవాద ముఠా కదలికలపై నిఘా ఉంచిన ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం, పక్కా సమాచారం, పటిష్టమైన నిఘా ఆధారంగా ఉమ్మడి ఆపరేషన్ నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకుంది. సుదీర్ఘ విచారణ, పక్కా ప్లానింగ్‌తో ఈ నెట్‌వర్క్‌ను ఛేదించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులను క్షుణ్ణంగా విచారిస్తున్నామని, వీరి వెనుక ఉన్న మరికొంత మంది సమాచారం సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# అత్యంత పారదర్శకంగా భారత ఎన్నికల నిర్వాహణ: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ డెస్క్:** భారతదేశంలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసే పారదర్శక మార్గదర్శకాలకు లోబడే జరుగుతుందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల ప్రక్రియ యొక్క పారదర్శకతను, నిష్పక్షపాతత్వాన్ని మరోసారి ఆయన నొక్కి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం ఏకంగా 1.8 కోట్ల మంది సిబ్బందిని రంగంలోకి దించుతుందని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఈ భారీ యంత్రాంగం అంతా అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తూ.. దేశంలో ఉచిత, నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా చూస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల వ్యవస్థ పటిష్టతకు ఈ యంత్రాంగమే వెన్నెముక అని కొనియాడారు.

# మట్టి దందా వెనుక బడా బాబు ఎవరు?...

## సరండి శివారులో అర్ధరాత్రి మట్టి తరలింపుపై పెరుగుతున్న అనుమానాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామ శివారులో రాత్రి వేళల్లో జరుగుతున్న మట్టి తరలింపు వ్యవహారం రోజురోజుకూ రెచ్చిపోతోంది. వివాదాస్పదంగా మారుతోంది. గ్రామ పరిసర ప్రాంతాల్లో జేసీబీ సహాయంతో పెద్దఎత్తున మట్టిని తవ్వి ట్రాక్టర్ ట్రాలీల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా అధిక వేగంతో సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామ శివారులోని ఒర్రెలు, వాగులు, కెనాల్ కాలువల సమీప ప్రాంతాలు, వ్యవసాయ భూముల పరిసరాల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ మట్టి తరలింపుకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకున్నారో, ఏ శాఖ నుంచి అనుమతి పొందారో, ఎంత మేరకు మట్టిని తరలించేందుకు అనుమతి ఉందో అనే విషయాలపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అన్ని అనుమతులు చట్టబద్ధంగానే ఉంటే రాత్రి వేళల్లో రహస్యంగా తరలించాల్సిన అవసరం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల భారీ శబ్దాలతో గ్రామంలో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నిద్రపట్టక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ట్రాక్టర్లు అధిక లోడుతో వేగంగా వెళ్లడం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికే గ్రామ రహదారులు దెబ్బతింటుండటంతో పాటు దుమ్ము, ధూళి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ వ్యవహారాన్ని ప్రశ్నించిన వారిపై కొందరు జేసీబీ యజమానులు, ట్రాక్టర్ ట్రాలీల నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు, మా వెనుక బలమైన నాయకులు ఉన్నారు, దమ్ముంటే ఆపండి వంటి వ్యాఖ్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ అక్రమ మట్టి తరలింపు వెనుక రాజకీయ, ఆర్థిక అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అధికారుల మౌనంపై ప్రశ్నలు ఇంత పెద్ద ఎత్తున మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. గ్రామ శివారులో రాత్రింబవళ్లు ట్రాక్టర్లు తిరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఫిర్యాదులు వచ్చినా చర్యలు లేకపోవడం వల్ల ఈ దందాకు ఎవరి అండ ఉందనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది. గ్రామస్తుల అభిప్రాయం ప్రకారం, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. మట్టి తవ్వకాలు ఎక్కడ జరుగుతున్నాయి? ఎంత మేరకు మట్టి తరలించారు? అనుమతులు ఉన్నాయా? లేక అక్రమంగా జరుగుతోందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు.

**అక్రమ మట్టి తరలింపుపై సీపీఎం ఆగ్రహం**

సరండి గ్రామ శివారులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న మట్టి తరలింపుపై సీపీఎం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాత్రి వేళల్లో మట్టి తరలింపునకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది. ప్రజా



సంపదను కొందరు వ్యక్తులు దోచుకుంటుంటే అధికారులు మౌనంగా ఉండడం దురదృష్టకరమని పేర్కొంది. గ్రామంలో భారీ వాహనాల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా మట్టి తరలించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సరండి గ్రామ శివారులో జరుగుతున్న మట్టి దందా వెనుక అసలు నిజాలు ఏమిటో అధికారులు వెలికితీసి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

# జూన్ 1 న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, పర్యటనలో భాగంగా ముందుగా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీల కోసం ప్రభుత్వం నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు.ఈ సభా వేదికపై నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని సుగుణక్క వెల్లడించారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు సభకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ సభ నిలుస్తుందన్నారు.సభ ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, జిల్లా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆత్రం సుగుణక్క కోరారు.ఈ సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి శ్యామ్ నాయక్,గ్రంధాలయ చైర్మన్ కామ్ డే అనిల్ కుమార్,ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షులు భీమ్ రావ్, తరఖ్, ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్,సెక్రటరీ నాంపల్లి శంకర్,డైరెక్టర్ జక్కన్న, ఆసిఫాబాద్ టౌన్ ప్రెసిడెంట్ రఫిక్, వాంకిడి ఉప సర్పంచ్ ముండే దీపక్,డీసీసీ మెంబర్ ఆత్రం భీమ్ రావ్, రాపర్తి



మురళి,మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, సర్పంచ్ రాథోడ్ సురేష్,మాజీ ఆత్మ చైర్మన్ కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు జావీద్,యాత్ కాంగ్రెస్ ఎలగల సాయి, కమలనాథ్ రెడ్డి ,మాజీ సర్పంచ్ పెద్దింటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుజాయిత్ ఖాన్,చునర్కర్ వాసుదేవ్, వేల్పుల సురేష్,చాపిడి సురేష్, ఆత్రం తిరుపతి, రమేష్,తదితరులు పాల్గొన్నారు

# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సైకిల్ యాత్ర.....

### జూన్ 2న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంటే అధికారులపై చర్యలు....

### ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుండి తుర్కపల్లి మండల కేంద్రం వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండలం పరిధిలోని మల్లాపూర్, దత్తాయిపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు అధికంగా ఉండటం, లారీల సమస్య, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, జూన్ 2వ తేదీ వరకు ఏ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కనిపిస్తే అధికారుల పై చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశించారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే హమాలీ కార్మికులను ఇతర ప్రాంతాల నుండి తుర్కపల్లి మండలానికి తరలించి ధాన్యం లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం దత్తాయిపల్లి నుండి వెంకటాపురం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు నాలుగు నుండి ఐదు చోట్ల లీకేజీలు ఉన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క తో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, వృధా అవుతున్న నీటిని అరికట్టేందుకు, వెంటనే మరమ్మతుల పనులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పర్యటన సందర్భంగా ప్రజలు తమ గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో



ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ‘ఆపరేషన్ సింధూర్ 2.0’ రెడీ! త్రివిధ దళాల సరికొత్త యుద్ధ వ్యూహం లీక్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ బ్యూరో:** భారత సరిహద్దుల్లో శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేలా చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం అత్యంత కీలకమైన, వ్యూహాత్మక ప్రకటన చేశారు. సాయుధ బలగాలు ‘ఆపరేషన్ సింధూర్ 2.0’కు సంపూర్ణంగా సన్నద్ధమై ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం సరిహద్దుల్లో శత్రుత్వాలు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపిస్తున్నప్పటికీ, లోపల మాత్రం భారత సైన్యం అత్యంత చురుగ్గా భవిష్యత్ సవాళ్లకు సన్నద్ధమవుతోందని భద్రతా బలగాల పరాక్రమాన్ని చాటిచెప్పారు. పుణెలోని ప్రతిష్ఠాత్మక ‘నేషనల్ డిఫెన్స్ అకాడమీ’ 150వ కోర్సు పాసింగ్-అవుట్ పరేడ్ సందర్భంగా శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.“ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించి మొదటగా ఒక విషయం గుర్తుంచుకోవాలి.. అది ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతానికి శత్రుత్వాలు తాత్కాలికంగా మాత్రమే నిలిచిపోయాయి. ఒకవేళ ‘ఆపరేషన్ సింధూర్ 2.0’ అంటూ జరిగితే, అందుకు భారత సైన్యంతో పాటు త్రివిధ దళాలు అత్యంత పటిష్టంగా, అద్భుతంగా సిద్ధపడుతున్నాయి” అని జనరల్ ద్వివేది సైన్యం యొక్క యుద్ధ సన్నద్ధతను తేల్చి చెప్పారు. కేవలం సాంప్రదాయ సరిహద్దులకే పరిమితం కాకుండా.. భూమి, గగనతలం, సముద్రం, అంతరిక్షం, సైబర్, కాగ్నిటివ్ వంటి బహుళ రంగాల్లోని సరికొత్త ఆధునిక యుద్ధ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని, అంతర్గత శక్తిని నిరంతరం బలోపేతం చేసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

**ఆపరేషన్ సింధూర్:లి ఇక ఊచకోతే, రాజ్‌నాథ్ వార్నింగ్**

**ఆపరేషన్ సింధూర్: ఇక ఊచకోతే, రాజ్‌నాథ్ వార్నింగ్**

**24/7 పారదర్శక యుద్ధభూమి.. ప్రతి కదలికపైనా నిఘా!**

భవిష్యత్తులో రాబోయే యుద్ధాలు మునుపటిలా ఉండబోవని, ఆధునిక సాంకేతికత వల్ల యుద్ధభూమి పూర్తిగా మారిపోయిందని ఆర్మీ చీఫ్ విశ్లేషించారు. “మనం కొంతకాలంగా గమనిస్తున్నదేమిటంటే.. అధునాతన సాంకేతికతలు, నిరంతర నిఘా కారణంగా నేటి యుద్ధభూమి 24 గంటలూ అత్యంత పారదర్శకంగా మారింది. మనం వేసే ప్రతి అడుగు, ప్రతి కదలిక అవతలి పక్షానికి (శత్రువుకు) క్షణాల్లో తెలిసిపోతుంది” అని ఆయన నొక్కిచెప్పారు. ఈ మారుతున్న పరిస్థితుల రీత్యా, వ్యూహాత్మకంగా మన బలగాల మోహరింపు విషయంలో, అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని మన సైనికులను, పౌరులను రక్షించడానికి అవసరమైన రక్షణ చర్యల విషయంలో మన రక్షణ వ్యవస్థ అత్యంత జాగ్రత్తగా, పటిష్టమైన వ్యూహాలతో ముందుకు సాగుతోందని హెచ్చరించారు.

**త్రివిధ దళాల ఐక్యతే దేశానికి శ్రీరామరక్ష!**



ఆధునిక బహుళ-రంగ కార్యకలాపాల సవాళ్లను సమర్థవంతంగా తిప్పికొట్టడానికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ మధ్య ఉండాల్సిన అపారమైన సమన్వయం దేశ భద్రతకు అత్యంత అత్యవసరమని జనరల్ ద్వివేది పునరుద్ఘాటించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా శత్రువుల వ్యూహాలను చిత్తు చేయడానికి భారత సాయుధ బలగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఇచ్చిన ఈ హై-ఎలివేషన్ స్టేట్‌మెంట్ ఇప్పుడు దేశ రక్షణ రంగంలో సరికొత్త జోష్ నింపింది.

# హోర్ముజ్ లో ఎదురేలేని భారత్ ..! దిగ్బంధాన్ని దాటే సీక్రెట్ వ్యూహం..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ బ్యూరో:** ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధంలో ప్రవేశించినప్పటి నుంచీ ప్రపంచంలోనే అత్యంత కీలకమైన చమురు మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధి దాదాపుగా దిగ్బంధంలో ఉంది. ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న ఈ ఇరుకైన జలమార్గం ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు 20 శాతాన్ని మోసుకెళుతుంది. ఈ అంతరాయం ఇంధన మార్కెట్లను కలవరపరిచి, ఇంధన ధరలను పెంచింది. తద్వారా ఆసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అస్థిరత భయాలను పెంచింది. ఏప్రిల్ 9న కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చాక కూడా ఈ జలసంధి చాలా వరకు మూసివేతలోనే ఉంది.దీంతో హోర్ముజ్ జలసంధిని అంతర్జాతీయ నౌకలు దాటేందుకు వీలు కావడం లేదు. అయితే, ఇంత అనిశ్చితి మధ్య కూడా అనేక భారత అనుబంధ నౌకలు ఈ ప్రమాదకర మార్గం గుండా ప్రయాణిస్తూనే ఉన్నాయి. ఈ ప్రాంతంలో తీవ్ర అంతరాయాలు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన సరఫరాలను కొనసాగించడానికి ఇది దోహదపడుతోంది. ఈ నౌకల రాకపోకలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు భౌగోళికంగా గణనీయమైన ప్రయోజనం ఉంది. ఫిబ్రవరి 28న యుద్ధానికి కారణమైన అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ నౌకలను పదేపదే లక్ష్యంగా చేసుకుంది.అయితే ఇలా భారతీయ నౌకలు మాత్రం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా హోర్ముజ్ ను దాటడం వెనుక కీలక కారణాలున్నాయి. తాజాగా జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖ సమావేశంలో, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారులు ఈ ఉద్రిక్త జలమార్గం గుండా భారత్ నౌకల కదలికలను ఎలా నిర్వహిస్తుందో వివరించారు. అయితే కార్యాచరణ వివరాలను మాత్రం వెల్లడించలేదు. తాము భారత్-ఇరాన్‌లతో ఎలా సమన్వయం చేసుకుంటాం, ప్రాధాన్యతను ఎలా నిర్ణయిస్తాం అనేవి స్పష్టమైన కారణాల రీత్యా చెప్పదలుచుకోలేదని, కానీ మేము విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా సమన్వయం చేసుకుంటామని, అది తమ విధానమని పోర్టుల మంత్రిత్వ శాఖ షిప్పింగ్ డైరెక్టర్ ఓపేష్ కుమార్ శర్మ పేర్కొన్నారు.తాజా వివరాల ప్రకారం ప్రస్తుతం దాదాపు 13 భారత జెండా ఉన్న నౌకలు హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉన్నాయి. వీటిలో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, ఐదు ముడి చమురు ట్యాంకర్లు, ఒక రసాయన లేదా ఉత్పత్తి ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్‌లు మరియు ఒక డ్రెడ్జర్ ఉన్నాయి.




ప్రమాదం ఉన్నప్పటికీ, భారత్ ఈ మార్గం గుండా సముద్రయాన రవాణాను కొనసాగిస్తోంది. ఈ జలసంధిని దాటుతున్న అత్యధిక సంఖ్యలో నౌకలున్న దేశాలలో భారత్ ఒకటిగా నిలుస్తోంది. ఫిబ్రవరి 28 నుండి ఈ జలమార్గాన్ని దాటిన భారత అనుబంధ నౌకలలో శివాలిక్, నందా దేవి, జాగ్ లాడ్కీ, పైన్ గ్యాస్, జాగ్ వసంత్, బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్, గ్రీన్ సాన్వి వంటివి ఉన్నాయి.

# సంక్షోభం వేళ స్ట్రాంగ్ గా పాకిస్థాన్.. బలహీనపడుతున్న భారత్..! ఇలాగే కొనసాగితే..?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం, ఇరాన్- అమెరికా యుద్ధం అలాగే ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు నేపథ్యంలో భారత రూపాయి విలువల క్షీణత కనిపిస్తోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలోనే రూపాయి విలువ 7 శాతానికి పైగా పడిపోయిందని చెబుతున్నారు. ముఖ్యంగా మార్చి, మే మధ్యకాలంలోనే 5 శాతం మేర వేగంగా పతనమైందని వివరిస్తున్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ఇవి భారత కరెన్సీపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చాయి.గత 12 ఏళ్లలో భారత రూపాయి విలువ డాలర్ తో పోల్చితే ఏకంగా 62 శాతం క్షీణించింది. 2014 లో ఒక డాలర్ విలువ రూ. 58.94 గా ఉండగా.. ప్రస్తుతం అది దాదాపు రూ. 95 కు చేరింది. భారత్ లో పరిస్థితి ఇలా ఉంటే దాయాది దేశం పాకిస్థాన్ లో మాత్రం పరిస్థితి మరోలా ఉంది. అక్కడ రూపాయి విలువ స్థిరంగా ఉండటం గమనార్హం. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. సౌదీ అరేబియా నుంచి అందిన ఆర్థిక సహాయం, అంతర్జాతీయ బాండ్ మార్కెట్ లోకి పాకిస్థాన్ తిరిగి ప్రవేశించడం వల్ల పెట్టుబడి దారుల్లో నమ్మకం పెరిగింది.ఇక పాకిస్థాన్ విదేశీ మారక నిల్వలు వేగంగా మెరుగయ్యాయి. మార్చి త్రైమాసికంలో నమోదైన కరెంట్ అకౌంట్ మిగులు వల్ల యూఎస్ డాలర్ పై ఉన్న ఒత్తిడి తగ్గింది. అలాగే విదేశాల నుంచి వచ్చే డబ్బు స్థిరంగా పెరగడం, చమురు ధరలు అదుపులో ఉండటం వల్ల గత ఆరు నెలల్లో పాకిస్థాన్ రూపాయి డాలర్ తో పోల్చితే 1.31 శాతం బలపడింది.మరోవైపు భారత్ లో రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి ఆర్బీఐ ప్రణాళికలు రచిస్తోంది. రూపాయి విలువ మరింత పడిపోకుండా నిరోధించడానికి.. 2013 ఆర్థిక సంక్షోభం సమయంలో ఉపయోగించిన పాత వ్యూహాలనే మళ్లీ అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భావిస్తోందని ఆర్బీఐ గవర్నర్



సంజయ్ మల్హోత్రా బ్లూమ్ బర్గ్ న్యూస్ తో పేర్కొన్నారు. వాటి వివరాలు చూస్తే.. వడ్డీ రేట్లను పెంచడం, అదనపు కరెన్సీ స్వాప్ లను నిర్వహించడం, రూపాయి విలువను స్థిరీకరించడానికి విదేశీ పెట్టుబడిదారుల నుంచి డాలర్లను సేకరించడం లాంటివి చేస్తోంది.

# మాజీ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడిపై కోడిగుడ్లతో దాడి.. చోర్.. చోర్ అంటూ నినాదాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, సెంట్రల్ బ్యూరో:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. సోనార్‌పూర్‌లో పర్యటిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అగ్రనేత, ఎంపీ అభిషేక్ బెనర్జీపై శనివారం ఊహించని రీతిలో దాడి జరిగింది. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో ఎన్నికల అనంతర హింసాకాండ బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన అభిషేక్ బెనర్జీపై కొందరు స్థానికులు రాళ్లు, కోడిగుడ్లతో దాడికి దిగారు. భౌతికంగా దాడి చేసేందుకు కూడా ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆయన హెల్మెట్ ధరించి బాధితుల ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

**బీజేపీ ఆందోళన - నినాదాలు..**

అదే సమయంలో అక్కడ భారీగా చేరుకున్న బీజేపీ కార్యకర్తలు అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా నిరసనలకు దిగారు. ఆయనను ముట్టడించే ప్రయత్నం చేస్తూ, ‘దొంగ.. దొంగ’ (చోర్.. చోర్) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మాజీ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు, పార్టీలో నంబర్-2గా పరిగణించే నేతపై నడిరోడ్డుపై దాడి జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీ, బీజేపీ శ్రేణుల పోటాపోటీ చర్యలతో పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు ఆ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఈ ఘటనతో బెంగాల్‌లో




అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వైరం మరింత ముదిరింది.

# నూతన దంపతులకు ఆశీర్వదించిన మాలోత్ నెహ్రూ నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 30, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం హున్య తండాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ యువరాజ్ సోదరుడు భూక్యా శ్రీను -- రమ్యల వివాహ రిసెప్షన్ వేడుక శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోత్ నెహ్రూ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివాహ బంధం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన అనుబంధమని పేర్కొన్నారు. భూక్యా శ్రీను -- రమ్యలు పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో దాంపత్య జీవితాన్ని సంతోషంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో నిండిన జీవితం గడపాలని శుభాకాంక్షలు తెలిపారు. రిసెప్షన్ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను అభినందించారు. వేడుక ఆత్మీయ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడింది.

# సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, నారాయణ ఖేడ్ :**



నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి మరియు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన మరియు పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల పనుల సాధన గురించి సమగ్రమైన వివరణతో కూడిన మెమొరాండం (వినతిపత్రం) ను ముఖ్యమంత్రి కి అందజేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారునియోజకవర్గంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, నియోజకవర్గాన్ని సుభిక్షం చేయాలని కోరారు.రహదారుల విస్తరణ ఒ మౌలిక వసతులు గ్రామీణ మరియు ప్రధాన రహదారుల అభివృద్ధికి, పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.నారాయణఖేడ్ ప్రాంత వెనుకబాటుతనాన్ని దూరం చేసేందుకు, నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరగాల్సిన అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్యాకేజీలు కేటాయించాలని కోరారు.నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చూపిన చొరవను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందించారు. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వినతిపత్రంలో పేర్కొన్న పెండింగ్ ప్రాజెక్టుల పనులను మరియు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, వీలైనంత త్వరగా నిధులు విడుదల చేసి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ముఖ్యమంత్రి సానుకూలంగా హామీ ఇచ్చారు.

# కాగజ్‌నగర్‌లో విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

లక్షల రూపాయల స్టాక్‌కు స్టాప్ సేల్.




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలో శనివారం ఎరువులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వరుణ్ ప్రసాద్ నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు జరిగాయి. పర్చేజ్ సర్టిఫికెట్లు (పిసి) లేకుండా విక్రయిస్తున్న విత్తనాల స్టాక్‌పై స్టాప్ సేల్ ఆదేశాలు జారీ అయ్యాయి. స్టాక్ సేల్ విలువ రూ.2,56,785గా నిర్ధారించారు.స్టాక్ బోర్డు, ధరల బోర్డు సక్రమంగా ప్రదర్శించని దుకాణదారులను హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలో పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలకు చేస్తున్న ముమ్మర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జెండా ఆవిష్కరణ స్థలం, పరేడ్ గ్రౌండ్, సభా ప్రాంగణం, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇటుకలపహాడ్‌లో పులుల పాదముద్రలు గుర్తించిన ఎఫ్‌డీవో అప్పయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)రేంజ్ పరిధిలోని ఇటుకలపహాడ్ అటవీ ప్రాంతంలో ఎఫ్‌డీవో అప్పయ్య పర్యటించారు. ఇటీవల నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, కుంటలను పరిశీలించారు. టైగర్ ట్రాకింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించి, పులుల పాదముద్రలు గుర్తించారు. పులుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, సెక్షన్ అధికారి మోహన్ రావు, వాచర్లు పర్యటనలో పాల్గొన్నారు.

# ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన స్రవంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.స్రవంతి ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఐఐఐటీ బాసరలో సీటు సాధించింది. ఆమె సాధించిన ఈ ఘనత పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వసంత ఉపాధ్యాయ బృందం స్రవంతిని అభినందించారు. ఆమె కృషి, పట్టుదల విద్యాపట్ల అంకితభావమే ఈ విజయానికి కారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య విద్యార్థినిని అభినందించడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. గ్రామ ఉపసర్పంచ్ బొంత సుధాకర్ స్రవంతి సాధించిన విజయాన్ని అభినందిస్తూ, ఆమె మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా తమ ప్రతిభతో ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని స్రవంతి నిరూపించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ స్రవంతికి అభినందనలు తెలిపారు

# ఎడారిలో డ్రాగన్ కంట్రీ భారీ స్కెచ్... అణు స్థావరాల చుట్టూ 80కి పైగా లాంచ్ ప్యాడ్స్.. శాటిలైట్ చిత్రాల్లో సంచలన నిజాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30 :** అగ్రరాజ్యం అమెరికాను ఢీకొట్టేందుకు చైనా పక్కా వ్యూహంతో పావులు కదుపుతోంది. డ్రాగన్ కంట్రీ వాయువ్య ప్రాంతంలోని జిన్‌జియాంగ్ ఎడారిలో అత్యంత రహస్యంగా నిర్మిస్తున్న ఓ భారీ సైనిక స్థావరానికి సంబంధించిన షాకింగ్ విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. శాటిలైట్ చిత్రాల ఆధారంగా రాయిటర్స్ వార్తాసంస్థ ఈ సంచలన నివేదికను బయటపెట్టింది. చైనా తన అత్యంత శక్తివంతమైన అణు క్షిపణులను దాచే 'సైలోస్' చుట్టూ భారీ సంఖ్యలో లాంచ్ ప్యాడ్స్, కమ్యూనికేషన్ నోడ్స్ నిర్మిస్తున్నట్లు ఈ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి."ఇలాంటి భారీ ఎత్తున జరుగుతున్న నిర్మాణాలను నేనెప్పుడూ చూడలేదు.. ఇది చాలా అసాధారణమైన విషయం" అని ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్‌కు చెందిన నిపుణుడు హన్స్ క్రిస్టెన్సెన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అమెరికా కనుక చైనా అణు స్థావరాలపై 'ఫస్ట్ స్ట్రైక్' (మొదటి దాడి) చేస్తే.. దాన్ని తట్టుకుని దీటుగా బదులివ్వడానికే బీజింగ్ ఈ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రతా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**శాటిలైట్ చిత్రాల్లో ఏముంది?**

జిన్‌జియాంగ్ తూర్పు భాగంలోని హామీ అణు క్షిపణి కేంద్రాలకు 140 నుంచి 230 కిలోమీటర్ల దూరంలో.. అష్టభుజి ఆకారంలో ఉన్న రెండు భారీ నిర్మాణాలను చైనా చేపట్టింది. వీటి చుట్టూ దాదాపు 80కి పైగా లాంచ్ ప్యాడ్స్‌ను సిద్ధం చేసినట్లు తాజా చిత్రాల్లో వెల్లడైంది. ఇక్కడ మొబైల్ మిస్సైల్ లాంచర్లు, ఎయిర్-డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను మోహరించే అవకాశం ఉంది. సైనిక వాహనాలు, సిబ్బంది ఉండేందుకు అనువుగా ప్రత్యేకంగా బంకర్లను, ఆయుధాగారాలను కూడా నిర్మించారు. స్పస్, మైక్రోవేవ్ కమ్యూనికేషన్ల కోసం భారీ శాటిలైట్ డిష్‌లు, టవర్లను సైతం ఈ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ లాంచ్ ప్యాడ్స్‌ను కలుపుతూ ఎడారిలో ఫైబర్-ఆప్టిక్ కేబుల్స్ నెట్‌వర్క్‌ను వేసినట్లు నిపుణులు గుర్తించారు.

**తైవాన్ టెన్షన్.. అమెరికా అలెర్ట్**

చైనా అధికారికంగా 'నో ఫస్ట్ యూజ్' (మొదట దాడి చేయం) అణు విధానాన్ని పాటిస్తోంది. కానీ, తైవాన్ విషయంలో ఏ దేశమైనా జోక్యం చేసుకుంటే, వారిని బెదిరించడానికే అణ్వాయుధ సామర్థ్యాన్ని చైనా రక్షణ కవచంగా వాడుకోవచ్చని పాశ్చాత్య దౌత్యవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాలపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ కూడా స్పందించారు. చైనా సైనిక విస్తరణ ఆందోళనకర స్థాయిలో ఉందని, ఆసియాలోని తమ మిత్ర దేశాలు రక్షణ బడ్జెట్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అమెరికాలోని ఏ నగరాన్నైనా ఇట్టే టార్గెట్ చేయగల లాంగ్-రేంజ్ ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్స్ చైనా వద్ద ఇప్పటికే ఉన్నాయి. సబ్‌మెరైన్లు, ఫైటర్ జెట్ల ద్వారా కూడా వీటిని ప్రయోగించగలదు. అయితే, శత్రు దేశాల దాడుల నుంచి ఆ మారణాయుధాలను కాపాడుకోవడమే లక్ష్యంగా ఇప్పుడు జిన్‌జియాంగ్, గన్సు ప్రావిన్సుల్లో ఈ అత్యాధునిక అండర్‌గ్రౌండ్, బంకర్ నెట్‌వర్క్‌ను చైనా వేగంగా విస్తరిస్తోంది.

# ఊబకాయం, పోషకాహార లోపం మధ్య నలుగుతున్న భారత్.. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే షాకింగ్ నివేదిక




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30 :** దేశంలో ప్రజల ఆరోగ్యం తీవ్ర సంక్షోభం దిశగా పయనిస్తోంది. ఒకవైపు ఊబకాయం, మరోవైపు పోషకాహార లోపం వెరసి భారత్ 'ద్వంద్వ ఆరోగ్య ముప్పు'ను ఎదుర్కొంటోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి ఐదుగురు పురుషుల్లో ఒకరు బ్లడ్ షుగర్ సమస్యతో బాధపడుతుండగా, జీవనశైలి వ్యాధులు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ వేగంగా విస్తరిస్తున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి గాను 715 జిల్లాల్లోని సుమారు 6.79 లక్షల గృహాల్లో నిర్వహించిన ఈ సర్వే గణాంకాలను శుక్రవారం విడుదల చేశారు.

**వేగంగా పెరుగుతున్న స్థూలకాయం**

గత సర్వేలో (2019-21) 24 శాతంగా ఉన్న ఊబకాయ మహిళల సంఖ్య తాజా సర్వే నాటికి 30.7 శాతానికి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 25.5% కాగా, పట్టణాల్లో ఏకంగా 42.8 శాతంగా ఉంది. పురుషుల్లో 22.9 శాతం నుంచి 27.3 శాతానికి పెరిగింది (పట్టణాల్లో 36.3%, గ్రామాల్లో 23%) గా ఉంది.

**విస్తరిస్తున్న మధుమేహం**

అధిక బ్లడ్ షుగర్ (>140ఎంజి/డిఎల్) తో బాధపడుతున్న లేదా మందులు వాడుతున్న పురుషుల సంఖ్య 15.6% నుంచి 20.9 శాతానికి జంప్ అయింది. మహిళల్లోనూ ఈ సంఖ్య 13.5% నుంచి 17.8 శాతానికి చేరింది. ఒకవైపు కొవ్వు పెరుగుతుంటే, మరోవైపు సరైన పోషకాలు లేక సాధారణం కంటే తక్కువ బీఎంఐ ఉన్న పురుషుల శాతం 16.2% నుంచి 19.7 శాతానికి పెరగడం ఆహార అభద్రతకు అద్దం పడుతోంది. అయితే, మహిళల్లో పోషకాహార లోపం 19.7% నుంచి 15 శాతానికి తగ్గడం కాస్త ఊరటనిచ్చే అంశం.

**పెరుగుతున్న సిజేరియన్లు..**

ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల ద్వారా ప్రసవాల సంఖ్య 47.4% నుంచి 54.1 శాతానికి పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఇది 14.3% నుంచి 16.9 శాతానికి పెరిగింది. ఇక, 5 ఏళ్ల లోపు పిల్లల్లో ఎదుగుదల లోపం 35.5% నుంచి 29.3 శాతానికి తగ్గింది. మద్యం సేవించే పురుషుల శాతం 18.7 నుంచి 18.9 కి స్వల్పంగా పెరిగింది.

**కారణాలేంటి? వైద్యుల హెచ్చరికలు**

అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ (ప్యాక్ చేసిన ఆహారం) వాడకం విపరీతంగా పెరగడం, శారీరక శ్రమ తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి ఈ మెటబాలిక్ వ్యాధులకు ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, భారతీయుల శరీర నిర్మాణంలో ఉండే 'థిన్-ఫ్యాట్ ఫెనోటైప్' (బరువు తక్కువ ఉన్నా అవయవాల చుట్టూ కొవ్వు చేరడం) లక్షణం వల్ల.. పైకి లావుగా కనిపించని వారిలో కూడా గుండె జబ్బులు, ఫ్యాటీ లివర్ తదితర ముప్పులు పొంచి ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. తక్షణం జీవన శైలి, ఆహారపు అలవాట్లు మార్చుకోకపోతే భవిష్యత్తులో దేశం తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు అవసరం:అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** జిల్లాలో భూగర్భ జలాల లభ్యతను పెంచేందుకు నీటి సంరక్షణ చర్యలు ముమ్మరం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సూచించారు. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 2025--26 నీటి సంవత్సరానికి సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా భూగర్భ జలాల అంచనా కమిటీ తొలి సమావేశం శనివారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, అటవీ, నీటిపారుదల, ప్రణాళిక శాఖల అధికారులతో భూగర్భ జలాల అంచనా ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. 2025--26 సంవత్సరానికి అవసరమైన మౌలిక సమాచారాన్ని శాఖలు సమయానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో సాధారణం కంటే 65 శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ జనవరి నుంచే నీటి సమస్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. భూగర్భ జలాల లభ్యతకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను నివారించవచ్చన్నారు. నవంబర్‌లో భూగర్భ జలాలు మూడు మీటర్ల లోతులో, మే నెలలో ఐదు మీటర్ల లోతులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.అత్యధిక భూగర్భ జల వినియోగ ప్రాంతాల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు పంట మార్పిడిని ప్రోత్సహించాలని సూచించారు. రెండో పంటగా బోర్ల కింద వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూగర్భ జలాల అంచనా విధానం, జిల్లాలోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. అనంతరం 2024--25 సంవత్సరానికి సంబంధించిన భూగర్భ జలాల అంచనా నివేదికను జిల్లా కమిటీ ఆవిష్కరించింది.

# రాష్ట్రంలో పాలన గాడి తప్పిపోయింది....

**రైతులను పట్టించుకునే నాథుడు లేడు....**
**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట పట్టణంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ హాజరై ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో పాలన గాడి తప్పిపోయింది రైతులను పట్టించుకునే నాథుడు లేడు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటన చేసేంత వరకు వడ్లను కొనే పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదు ఎక్కడ కుప్పలు అక్కడే ఉన్నాయి అన్నదాతలు హరిగోస పడుతున్నారు లారీలలో కనీసం వడ్లు తరలించే పరిస్థితి కూడా లేదు మంత్రులు, సీఎం ఎవరి కుమ్ములాటలు వాళ్లకు ఉన్నాయి రైతుల కష్టాలు వాళ్లకు హాస్యాస్పదంగా అనిపిస్తుంది రైతులను హేళన చేసి అవమానిస్తున్నారు. ఈ రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంస్టాగ్రామ్ లో రీల్స్ కే పరిమితం అవుతున్నారు. వరంగల్ డిక్లరేషన్ ఎక్కడ పోయిందని ఎద్దేవా చేశారు. ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారని ఎంత మంది కౌలు రైతులకు డబ్బులు ఇచ్చారు....? ఇంత దరిద్రమైన ప్రభుత్వం ఎన్నడూ చూడలేదు కమిషన్ కక్కుర్తిలో ఉన్న ఆసక్తి ప్రజా పాలన పైన లేదు కేంద్ర ప్రభుత్వమే అన్ని ఇస్తున్న కూడా కనీసం వాటిని ఎలా వినియోగించుకోవాలో తెలియని దద్దమ్మలు ఈ రాష్ట్రంలో ఉన్నారు కావున తక్షణం ఒక్క గింజ లేకుండా ప్రభుత్వం వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ మండల అధ్యక్షులు గుంటుపల్లి మహేశ్వరి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కొప్పుల యాదిరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మండల కౌన్సిల్ మెంబర్ మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్, పట్టణ కార్యదర్శి దొమ్మట ప్రభాకర్, ఆవుల సత్యనారాయణ, ఆలేటి కర్ణ, పలువుల సురేష్, సీనియర్ నాయకులు దాచేపల్లి రాజు, లెంకల పల్లి శ్రీనివాస్, బోనగిరి శ్యాంసుందర్, బందార మల్లేష్, ఆరుట్ల స్వాతి, నంగునూరి బాలరాజు, దొమ్మాట నరేష్, మిరియాల కృష్ణ, దొంత భరత్, బండి మహేష్, జోగు మహేష్, గౌటి పోచయ్య, గోపాల అంజలి, పంజాల గోవర్ధన్, కూరెళ్ల బాల చారి,ఆకుల దేవేందర్, అజ్మీరా కిషన్ నాయక్, సుదగాని శివ, కర్ర లక్ష్మయ్య, రాపోలు నవీన్, కాలూరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వడ్ల చోరీ.....

**వడ్ల రాశి నుంచి 15 బస్తాల వడ్లు మాయం....**
**ఆందోళనలో రైతులు....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం నర్సాపూర్ గ్రామంలో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల చోరీ ఘటన కలకలం రేపింది. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రాశులుగా పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం రైతుల్లో ఆందోళనకు గురిచేసింది. గ్రామానికి చెందిన రైతు తుమ్మ ప్రశాంత్ తన పంట పొలం నుంచి తీసుకొచ్చిన వడ్లను ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రాశిగా పోసి కొనుగోలు కోసం ఉంచాడు. శుక్రవారం రాత్రి కొనుగోలు కేంద్రం వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రైతు వడ్ల రాశిని లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో సుమారు 15 బస్తాల వడ్లు చోరీకి గురైనట్లు రైతు తుమ్మ ప్రశాంత్ తెలిపారు. ఉదయం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతు తన వడ్ల రాశి తగ్గిపోయినట్లు గుర్తించి అధికారులకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. దీంతో కొనుగోలు కేంద్రం వద్దకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ... ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండగా రాత్రి వేళల్లో సరైన భద్రత లేకపోవడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు, రాత్రి భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధాన్యానికి పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈ ఘటన పై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే చోరీకి గురైన ధాన్యానికి రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాల్లో భద్రతా లోపాలు బయటపడిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రైతులు తమ ధాన్యం రక్షణపై ఆందోళన వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో నంగునూరు రాజు రితిక ప్రత్యేక పూజలు.....

**నంగునూరు రాజు రితిక వివాహ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు.....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు నంగునూరు రాజు రితిక దంపతులు వివాహ దినోత్సవ సందర్భంగా శు క్రవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ గోత్ర నామార్చన అష్టోత్తర పూజలను నిర్వహించారు. వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసిన అనంతరం శాలువాతో సత్కరించారు. జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు నంగునూరు సోమయ్య ప్రణవి దంపతుల కూతురు సహస్ర జన్మదిన కార్యక్రమం సందర్భంగా చిన్నారి సహస్ర తల్లిదండ్రులు సోమయ్య ప్రణవిలతో ప్రత్యేక పూజలు చేసారు. రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, యాదగిరిగుట్ట లోటస్ టెంపుల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్న సత్ర సంఘం ప్రధాన కార్యదర్శి, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ట్రస్ట్ సభ్యులు, రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ స్వప్న దంపతులు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా నేరుగా పలువురు రాజు రితిక దంపతులకు వివాహ దినోత్సవ శు భాకాంక్షలు చెప్పారు

## యాజమాన్యాలు మొండి వైఖరి వీడి
# కార్మికులకు న్యాయం చేయాలి....

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం, భావన రుషి చేనేత కార్మికుల సమ్మె శనివారం 9వ రోజుకు చేరుకుంది, యజమానుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో భావన రుషి చేనేత కార్మికులు దీక్ష చేశారు. సమ్మెకు సంఘీభావం తెలపడానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం పాల్గొని మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ధరలు పెంచాల్సి ఉన్న యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మొండి వైఖరి వీడాలని విమర్శించారు. వారం రోజులుగా సమ్మె జరుగుతున్న యాజమాన్యాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రోజు పని చేస్తే గాని పూట గడవని చేనేత కార్మికులు వారం రోజులుగా సమ్మె చేస్తున్న నేత కార్మికులకు, గత ఆరు సంవత్సరాలుగా కూలి రేట్లు పెంచకపోవడం విడ్డూరమని ఈ గత ఆరు సంవత్సరాల లో నిత్యవసర సరుకులు రోజురోజుకి పెరుగుతున్న నైపద్యంలో కార్మికులు చేస్తున్న పనికి ప్రతిఫలం మాత్రం శూన్యంగా మారిందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ధరలు పెంచాల్సిన యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని అన్నారు,



యాజమాన్యాలు స్పష్టత ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. నిత్యవసర సరుకులతో పాటు పెట్రోల్ డీజిల్ ధరలు కూడా రెండింతలు అయ్యాయని ఇప్పటికైనా యాజమాన్యాలు నేత కార్మికుల సమస్యను మానవత దృక్పథంతో అర్థం చేసుకొని కూలి రేట్ల ధరలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొని భావన రుషి కార్మిక సంఘానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మూల పోచయ్య, గణపురం నర్సింలు, దాసరి రమేష్, బల్ల శ్రీనివాస్, మదనాల వెంకటేష్, మదనాల శంకర్ పాల్గొన్నారు.

## తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి వ్యాఖ్యలను ఖండించిన చంద్రబాబు

**బక్కని నర్సింహులు వ్యాఖ్యలను తప్పుపట్టిన సీఎం చంద్రబాబు**
**చారిత్రక ప్రాంతాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరమని హితవు**
**'గొడ్డలి పార్టీ' అనే పేరుతో వైసీపీలో ఫ్రస్ట్రేషన్ పెరిగిందన్న సీఎం**
**వివేకా హత్య కేసులో సునీత పోరాటానికి సంపూర్ణ మద్దతు**
**నియోజకవర్గాలను 50 శాతం పెంచితే రాష్ట్రానికి నష్టం ఉండదని సూచన**



తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు తప్పుపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు నేతలు సంయమనం పాటించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. "తెలంగాణ అనే పదం నిఘంటువులోనే లేదు" అంటూ బక్కని ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు ఈ స్పష్టత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. తెలుగు జాతి ఒక్కటేనని, తెలంగాణలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని స్పష్టం చేశారు.అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. 'గొడ్డలి పార్టీ' అనే పేరు ప్రజల్లోకి బలంగా వెళు తుండటంతో వారిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. వైఎస్ కుటుంబ అరాచకాలు తమకు కూడా పూర్తిగా తెలియవని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటానికి చంద్రబాబు మద్దతు తెలిపారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని, ఆమె పోరాటం వల్లే ఈ కేసు ఇంకా సజీవంగా ఉందని అన్నారు.నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా ఉందని, అవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పునర్విభజనలో రాష్ట్రానికి నష్టం జరగకుండా ప్రస్తుతమున్న స్థానాలను 50 శాతం పెంచితే మేలు జరుగుతుందని సూచించారు.

# ధాన్యం కొనుగోలు జాప్యం పై రైతుల ధర్నా....

**కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన ధాన్యం - ఆందోళనలో అన్నదాతలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం రాజపేట మండలం నమిలే గ్రామ రైతులు రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండిపోవడం, తూకం ప్రక్రియ ఆలస్యం కావడం, తరుగు పేరుతో ఇబ్బందులు పెట్టడం వంటి సమస్యలపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో రైతులు నమిలే క్రాస్ రోడ్ పై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల నినాదాలతో ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి వారాల తరబడి ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయంతో రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే కాపలా కాస్తున్నామని తెలిపారు. వర్షం కురిస్తే ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతిని భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడం, గన్నీ సంచుల కొరత, రవాణా వాహనాల సమస్యల కారణంగా కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయని రైతులు ఆరోపించారు. ధాన్యం తూకం వేసిన తర్వాత కూడా మిల్లులకు తరలించడంలో ఆలస్యం జరుగుతోందని, దీంతో కొత్తగా వచ్చే రైతుల ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. రైతుల



సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే హామీలతో సరిపెట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోళ్లు వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల లభ్యతను పెంచేందుకు
# నీటి సంరక్షణ చర్యలు ముమ్మరం చేయాలి

**భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి....**
**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 30, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భూగర్భ జలాల లభ్యతను పెంచేందుకు నీటి సంరక్షణ చర్యలు ముమ్మరం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సూచించారు. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 2025-26 నీటి సంవత్సరానికి సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా భూగర్భ జలాల అంచనా కమిటీ తొలి సమావేశం శనివారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, అటవీ, నీటిపారుదల, ప్రణాళిక శాఖల అధికారులతో భూగర్భ జలాల అంచనా ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. 2025--26 సంవత్సరానికి అవసరమైన మౌలిక సమాచారాన్ని శాఖలు సమయానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాధారణం కంటే 65 శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ జనవరి నుంచే నీటి సమస్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. భూగర్భ జలాల లభ్యతకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను నివారించవచ్చన్నారు. నవంబర్‌లో భూగర్భ జలాలు మూడు మీటర్ల లోతులో, మే నెలలో ఐదు మీటర్ల లోతులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అత్యధిక భూగర్భ జల వినియోగ ప్రాంతాల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు పంట మార్పిడిని ప్రోత్సహించాలని సూచించారు. రెండో పంటగా బోర్ల కింద వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. సమావేశంలో భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూగర్భ జలాల అంచనా విధానం, జిల్లాలోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.